కథా నిలయం
4748
శ్రీకాకుళం

# విద్య

"మే ఐ కమిన్ మేడమ్ ?"

చెపుతూన్న పాఠం ఆపి విసుగ్గా ఇటు చూచింది రమాదేవి.

విద్య !

కుడిచేతిలో నాజూకుగా రెండు పుస్తకాలున్నాయి. ఎడమచేత్తో గిరిజాల జుట్టును పోగ్గా వెనక్కు తోసుకుంటూ, విపరీతంగా కాటుక అలదిన కండ్లను తమాషాగా చికిలిస్తూ, విద్యార్థుల బెంచీలవైపు అలవోకగా చూస్తూ నిలబడివున్నది.

నీలం రంగు నైలాన్ బనియన్.

కొట్టవచ్చినట్లున్న ఎఱ్ఱని నైలాన్ స్ట్రెచ్ పాంట్.

అంగాంగ పరిమాణమూ స్పష్టంగా ప్రదర్శితమౌతూన్నది.

"ఏదో ఒకటి రెండు రోజులు ఎప్పుడైనా, ఏ కారణంగానైనా ఆలస్యంకావచ్చు ఎవరికైనా. నీకు రోజూ ఎందుకిలా లేటౌతుంది?" అసహనంగా అడిగింది.

ఆ ప్రశ్న తనకు కాదన్నట్లుగా ఓ నిర్లక్ష్యపు నవ్వు నవ్వి, సమాధాన మీయకుండా నిలబడింది విద్య, రంగులు పులిమిన తన గోళ్ళవైపు చూచుకుంటూ.

"చక్కగా కారులో వచ్చే నీవే సరైనా సమయానికి రాలేకపోతే, ఇక నడచి వచ్చేవాళ్ళూ రిక్షాలమీదవచ్చే వాళ్ళూ ఎలా రాగలుగుతున్నారనుకుంటున్నావు?"

ఈసారీ సమాధానం లేదు.

హైహీల్డ్ షూస్‌ను తమాషాగా నేలపై తాటిస్తూ, ఆ మాటలన్నీ మరెవరినో అన్నట్లుగా చూడసాగింది విద్య.

"ఈ రోజుకు వచ్చి కూర్చో, రేపట్నుంచీ ఇలాగ ఆలస్యమైతే రానీయలేను." చికాకుగా అనేసి, మధ్యలో ఆపిన పాఠం పుస్తకం తీసుకుంది చేతికి. తోటి విద్యార్థినీ విద్యార్థుల దెస సగర్వంగా చూస్తూ వెళ్ళి తన స్థానంలో కూర్చున్న విద్య పెదవులపై హేళనా పూర్వకమైన చిరుహాసం నర్తించడం గమనించింది రమాదేవి.

అంతేకాదు. అంత వఱకూ నిశ్శబ్దంగా పాఠం వింటూన్న విద్యార్థులలో కలకలం రేగింది. విద్యదెస కొంట

చూపులు విసురుతున్నారు. విన్పించీ విన్పించకుండా ఏదేదో గొణుగుతున్నారు.

వాళ్ళ వ్యాఖ్యానాలకు విద్య కొంటెగా గర్వంగా నవ్వుతోంది.

ఆ కళాశాలకు లెక్చరర్ గా వచ్చిన ఈ రెండు నెలల నుండీ ఈ భాగోతాన్ని యించుమించుగా రోజూ చూస్తూనే వున్నది రమాదేవి.

విద్య ఆలస్యం కాకుండా అరుదెంచిన రోజులను వ్రేళ్ళపై లెఖ్ఖపెట్టవచ్చు.

'ధనవంతుల పిల్ల. కారుమీద తప్ప కళాశాలకు రాదు, కళాశాల నుండి పోదు. మరి ఏమిటి ఈ ఆలస్యం, ఏవో చదువును మించిన రాచకార్యాలున్నట్లు?

ఆమె ధరించే ఆ బిగుతు దుస్తులూ, విపరీతమైన అలంకరణా విద్యార్థులలో కవ్వింపు కలిగించుతూన్నట్లు స్పష్టంగా కానవస్తోంది.

విద్య ఉద్దేశ్యమే అదా?

అందరినీ ఆకర్షించడానికే కోరి ఆలస్యంగా వస్తూన్నదా?'

పేరు విద్యేకానీ విద్యలో ఆమె ప్రావీణ్యమెంతో పరీక్షించ దలచుకున్న రమ, బోధించుతూన్న పాఠాన్ని ఆపు చేసింది.

"ఈ రెండు నెలలుగా అయిన పాఠాలు మీకు ఎంత వరకూ అర్థమయ్యాయో చూస్తాను. నేనడిగే ప్రశ్నలకు

సమాధానాలు చెప్పండి." అన్నది తరగతి నంతనూ ఉద్దేశించి.

తరగతి మొత్తం అరవై నలుగురిలోనూ ఇద్దరు విద్యార్థినులూ, ముగ్గురు విద్యార్థులూ మినహా ఎవ్వరూ సరిగా సమాధానాలు చెప్పలేక పోయారు.

అసలు ఓనమాలే రానట్లుగా మొద్దులుగా నిలబడిన వారిలో విద్య ఒకతె.

"ఎప్పటి పాఠాలు అప్పుడు చదివేసుకుంటూ వుంటే పరీక్షల ముందు హైరానా, ఖంగారూ తప్పుతుంది. రేపటి నుండి అందరూ అయినంతవఱకూ అన్ని పాఠాలూ క్షుణ్ణంగా చదువుకు రావాలి. ఇలాగే ఎప్పుడైనా సరే నేను 'టెస్ట్' చేస్తూవుంటాను." అని హెచ్చరిక చేసి వదిలేసింది రమ.

విద్యను ప్రత్యేకంగా ఏమీ అనలేదు.

కాని ఆ అమ్మాయిని గురించిన ఎన్నో ఆలోచనలతో మనసు నిండిపోయింది.

'ఎందుకంత వెకిలిగా అంగసౌష్ఠవం అంతా ప్రదర్శించే దుస్తులు ధరించి వస్తుంది అందరు మగవాళ్ళ మధ్యకు?'

'ఆ కళ్ళు ఎప్పుడూ అలా ఎవరినో హేళన చేస్తూన్న చూపులు చూస్తూంటాయేం?'

'ఆ పెదవులపై వికృతమైన రంగుపూతతో పాటు నిత్యం ఆ వంకర నవ్వు ఎందుకో?'

'ఇంత ఆర్భాటంగా కాలేజీకి వస్తూ కొంచమైనా పాఠాలు చదవక పోవటం సిగ్గుగా వుండదా ?'

## 2

ఏకసమికస్నపాఠం దీక్షగా బోధించుతూన్న ఉపాధ్యాయిని రమా, శ్రద్ధగా వింటూన్న విద్యార్థినీ విద్యార్థులూ కూడ దృష్టి చెదరి చూచారు.

"మే ఐ కమిన్ మేడమ్ ?"

పెద్ద పెద్ద ఎఱ్ఱని పువ్వుల అద్దకంవున్న నల్లని లుంగీ, ఎఱ్ఱని కమీజూ ధరించిన విద్య విలాసంగా నిలబడి వున్నది ఓ చేయి నడ్డిన ఆనించుకుని.

అందరూ రమాదేవి ఏమంటుందోనని కుతూహలంగా చూస్తున్నారు.

తాను హెచ్చరించిన తర్వాత వారం రోజులు గడచి ఇది ఎనిమిదవరోజు.

ఈ అన్నిరోజులుగా విద్య ఎప్పటికంటె ఆలస్యంగా వస్తోంది పంతం పట్టినట్లు.

వచ్చి అలాగే సవిలాసంగా నిలబడ్తుంది సవాలు చేస్తున్నట్లు, పాఠం మధ్యలో 'డిస్టర్బ' చేశాననే సిగ్గు ఆ ముఖాన ఏమాత్రం ద్యోతకం కాకపోగా, ఏదో ఆధిక్యత వ్యక్త మౌతుంది.

తోటి లెక్చరర్స్ తమలో తాము చెప్పుకోవడం ఒకటి రెండుసార్లు విని వున్నది రమాదేవి —

'విద్య చాలా ధనవంతుల అమ్మాయి. అటువంటి వాళ్ళు మరో అయిదారుగురున్నారు కళాశాలలో. వాళ్ళను క్రమశిక్షణలో వుంచడం ఎవరి తరమూ కాకపోగా, ప్రిన్సిపాల్ కూడ వారికి ఝుడుస్తూ బ్రతకాలి'

లెక్చరర్ ఆలోచనలలోపడి తనకు 'యస్' చెప్పక పోవడం విద్యలోని అహంపై దెబ్బతీసింది.

ఆమె పర్మిషన్ కొఱకై అలా నిలబడివుండడం అవమానకరంగాభావించినట్లు వ్యక్తం చేసే జోరైన పదధ్వనితో, నిరసన కురిపించే చూపులతో టకటకా పోయి తన స్థానంలో కూర్చున్నది.

ఆమె అంత తెంపరి అని తెలియని రమాదేవి విస్మయం నిండిన క్రోధంతో చూచింది.

విద్యార్థినులంతా నవ్వులను బలవంతంగా ఆపుకొంటున్నారు.

విద్యార్థులలో వికవికలూ, పిల్లి అరపులూ, కుక్క-కూతలూ ప్రారంభమైనాయి.

ఉపాధ్యాయులనబడే దుష్టులపై విద్యార్థి దేవతలు విజయం సాధించిన గర్వరేఖలు తాండవ మాడుతున్నాయి అనేక వదనాలపై.

రమాదేవి ఇంగిత జ్ఞానం కలది.

ఈ రోజులలోని యువతీ యువకులు ప్రతిదానికీ సమ్మెలు ప్రారంభించి ఎంతవఱకూ పోగలరో ఆమెకు తెలుసు.

విద్య వేష భాషా ప్రవర్తనలు ఆమెకు విద్యా వినయాలపై ఏ మాత్రము గౌరవం వున్నదో, అసలు వాటి అవసరం ఆమెకు ఎంత మాత్రమో—అనే విషయాలను చెప్పక చెప్పుతున్నాయి.

అందువల్లనే పట్టుదల ప్రదర్శించి ఒక అనవసర దృశ్యాన్ని సృష్టించి విద్యార్థులకు లోకువ కాదలచుకో లేదు.

'నా అనుమతి లేనిదే లోపలి కెందుకొచ్చావ్ ?' అని అంటే విద్య తప్పక తలతిరుగుడు సమాధానాలు చెబుతుందనడంలో అనుమానం అనవసరం.

కానీ ఈ సంఘటనను అలుసుగా తీసుకొని తదితర విద్యార్థులెవరైనా అలా మితిమీరి ప్రవర్తించడం ఇక పరిపాటి కావచ్చు. అలా క్రమ క్రమంగా విద్యార్థులకు తన యెడల నిర్లక్ష్యం పెంపొంది, విద్యార్థులను అదుపులో పెట్ట లేని అప్రయోజకపు లెక్చరర్స జాబితాలో తానూ జేరి పోగల ప్రమాదమున్నది. ఒక్క నిముషంలో రమాదేవి మస్తిష్కంలో ఇన్ని ఆలోచనలూ, తర్క వితర్కాలూ కదలిపోయాయి.

తన అంతర్గత భావాలు పైకి ప్రదర్శితం కాకుండా తనను తాను సంబాళించుకున్నది.

విద్య ప్రవర్తనా, నిర్లక్ష్య వైఖరీ తనను ప్రాభావితం

చేయనక్కర్లే, ఏ మాత్రమూ ఆవేశపడకుండా అన్నది:
"విద్యా! లంచవర్‌లో స్టాఫ్ రూంకి వచ్చి నన్ను కలుసుకో ఓసారి."

అలా అనేసి పాఠం చెప్ప ఉద్యుక్తురాలౌతూన్న రమాదేవి కర్ణపుటాల లోనికి "మేడమ్!" అనే విద్య పదునైన కంఠస్వరం చాకులా దూసుకుపోయింది.

"మేడమ్! స్టాఫ్‌రూములకూ, లెక్చరర్స్ ఇళ్ళకూ తిరిగి కాకాపట్టడం, దాసోహం చేయడం మా వంశంలో లేనివి, ఎంతటి వాళ్ళైనా మా యింటికే వస్తారు!"

కూర్చున్న తావునుండి కదలక పోగా, కాలుపై కాలు వేసుకుని ఠీవిగా, అహంకారంగా అంటూన్న విద్య దెస రమ అప్రతిభురాలై చూస్తూండగానే గంట మ్రోగింది.

ఈలలూ, కేకలూ, వికవికలతో విద్యార్థులు బయటకు పోతున్నారు, రమదెస ఒక్కో హేళనా పూర్వకమైన చూపు విసురుతూ.

విద్యార్థినులందరి గుంపు ఎదరా నాయకురాలిలా నడుస్తూన్న విద్య ఒక్కసారి రమాదేవి కుర్చీవద్ద ఆగింది. టేబుల్‌పై వ్రేళ్ళతో మద్దెలదరువు వేస్తూ అన్నది:

"నేను మ్యునిసిపల్ కమిషనర్‌గారి అమ్మాయిని. మా ఇల్లూ, ఫోన్ నంబరూ ఎవరి నడిగినా చెప్తారు!" హైహీల్స్ టకటక లాడించుకుంటూ సాగిపోయింది, రమాదేవి కర్తవ్య మూఢురాలై చూస్తూండగా.

# 3

అప్రసవ్యమైన విషయాలు జరిగినప్పుడు ఎంతటి విజ్ఞుల మనస్సైనా కలతపడడం సహజం.

'ఇలా పెంకెతనాలకు పోయి చేజేతులా ఎందుకు పెడసరపు బుద్ధులూ, పెడత్రోవలూ అలవరచుకుంటారు కొందరు? ఈ పెంకెతనం భవిష్యత్తులో కూడా అన్ని వేళలా ఆమెతో నిలువగలదా?'

"ఆహా, మీకా సందేహ మక్కరలేదు రమాదేవి గారూ, ఈ పట్టణాన్నే కొనేయగలంత ధనవంతులు వాళ్ళు. వాళ్ళకు విద్య ఒక ఆభరణం. మనలా పొట్టకూటి నౌఖరికోసం కాదు. అందువల్ల నౌఖరీ నిలబడాలంటే మనం కొన్ని కొన్ని వేళల్లో మూగవాళ్ళంగా, మరొకప్పుడు చెవిటి వాళ్ళుగా, ఇంకొన్ని సమయాలలో గ్రుడ్డివాళ్ళంగా అయిపోవాలి. అంతకంటె మార్గంలేదు!" అన్నారు విషయం విన్న లెక్చరర్స్ కొందరు.

ఆ మాటలు నూటికి నూరుపాళ్లూ నిజమే అయినా, రమాదేవి మనస్సు మాత్రం మథనపడడం మానలేదు.

అయితే ఆమె వ్యథ తనను గురించి కాదు.

తన కేం? శుభ్రంగా చదువుకున్నది, ఉద్యోగంలో

వున్నది; ఇంకా ఇంకా వృద్ధిలోనికి రాగలదు. వచ్చి తీరుతుంది.

కానీ ఇలా మ్రొక్కుబడిగా ఉద్యోగం చేయడమేనా ధ్యేయం?

కాదు, అది నూటికి తొంభైమంది చేస్తూన్నదే.

విద్యవంటి అవివేకులను సన్మార్గంలోనికి త్రిప్పగలిగితే ఎంత సంతృప్తి! మరెంత సార్థకత!

తాత్కాలికంగా విద్య విషయం పట్టించుకోనట్లుగా ప్రవర్తించసాగింది కొన్నిరోజుల వఱకూ.

ఉపాధ్యాయినికి తన తడాఖా తెలిసి వచ్చిందనుకున్న విద్య మరింత విఱ్ఱవీగ సాగింది.

ఆరోజు పాఠబోధన ఎప్పటి మాదిరిగానే జరుగుతోంది.

అంతరాయంకలిగించుతూ తపాలా బంట్రోతువచ్చాడు.

"బియ్యే ఫస ్టియర్ క్లాసు యిదే కదండీ?"

"ఔను."

"విద్యారాణిగారికి ఉత్తరం."

ఆ మాట వింటూనే విద్యార్థుల బెంచీలనుండి రంయ్యి రంయ్యిన ఈలలు దూసుకువచ్చాయి.

ఒకడు కీచుగా అరిచాడు "లవ్ లెటర్" అంటూ.

"సైలెన్సు ప్లీజ్." గదమాయించుతూ డస్టర్‌తో మేజాపై శబ్దంచేసింది రమాదేవి.

ఈలలైతే తగ్గాయి కాని గుసగుసలు పోసాగారు ఇద్దరిద్దరు విద్యార్థులు తమలో తాము.

విద్యార్థినులూ నిశ్శబ్దంగా లేరు.

“ఆ అమ్మాయి యింకా రాలేదు. నేనిస్తాను వచ్చాక.”

ఉత్తరం తాను తీసుకుని పోస్ట్‌మాన్‌ను పంపివేసింది.

పదినిముషాల అనంతరం వచ్చిన విద్య ఎప్పటి అలవాటుగా, లెక్చరర్ అనుమతి తీసుకోకనే దర్జాగా పోయి తన సీటులో కూర్చున్నది.

ఆమెను తమ నాయకురాలిగా భావిస్తూ, రాకుమారి వద్ద దాసీజనంలా నిత్యం అంటిపెట్టుకొని వుండే ఆమె సహపాఠినులు నేటి ఆమె క్రొత్త దుస్తులను ఆరాధనగా చూస్తూ గుసగుసలు పోతూ ఉత్తరం విశేషం ఆమె చెవిన వేశారు.

పాఠం బోధించుతూనే అన్నీ గమనించుతూనే వున్నది రమాదేవి.

విద్యారాణి ముఖ కవళికలు ముందు సంతోష ప్రకటన చేశాయి? బహుశః ఉత్తరం వచ్చినందుకు కావచ్చు.

ఆధిక్యతాభావం తళుక్కున మెరిసింది ఆ కనులలో, ఆ విశేషం వల్ల తనకేదో ప్రత్యేకత లభించినట్లు.

తర్వాత వరుసగా ఆశ్చర్యం ఆగ్రహం కదలిపోయాయి.

లెక్చరర్ దన తీవ్రంగా చూచింది.

గబగబా లేచి అటు నడచింది, ఆ లేఖను తీసుకొనే ఉద్దేశ్యంతో.

వెంటనే గంట మ్రోగింది.

రమాదేవి విద్యను గమనించనట్లే ఉత్తరం చేతిలోనికి తీసుకుని స్టాఫ్‌రూంలోనికి నడిచింది.

విద్య అహం దెబ్బతిన్నది.

కోపంతో నాగినిలా బుసలు కొట్టింది.

"ఈ కారణంగానైనా తనవెంట స్టాఫ్ రూంలోనికి వెళ్ళి కల్సుకుంటావని ఈ ఉపాయం పన్నింది మేడం. మొన్ననోనాడు అన్నావ్ కదూ నీకు ఎవ్వరి వద్దకూ వెళ్ళడం అలవాటులేదని!"

స్నేహితులు నెగడు ఎగద్రోశారు.

"మై ఫుట్! చూస్తానదేమిటో!" ముక్కు పుటాలు అదురుతూండగా సివంగిలా బయలుదేరింది విద్య స్టాఫ్‌రూం లోనికి.

"నా ఉత్తరం......?"

పొగరుగా చేయి చాచింది, యివ్వమని ఆదేశిస్తూ న్నట్లుగా.

కుర్చీలో కూర్చుని వున్న రమ తొణకకుండా పరీక్షగా చూచింది విద్యను ఆపాదమస్తకం.

విద్య చాలా అసహనంగా అన్నది; "అసలు నా ఉత్తరం మీరు తీసుకోవడంలో అర్థం ?"

"ఇలా కూర్చో !" శాంతంగా అన్నది రమ.

అయిష్టంగానే కూర్చున్నది విద్య.

"నీకు యిదివరలో కూడ ఇలా ఉత్తరాలు రావడం చూచాను. ఎవరు వ్రాస్తున్నారు ?"

"మీ కనవసరం ఎందుకు మీకా వివరాలు ?"

"అవసరమే, ఇంటివద్ద తలిదండ్రులెంతో ఇక్కడ మేమూ అంతే. మీ నడవడిని జాగ్రత్తగా చూడవలసిన బాధ్యత మాది." అన్నది రమ శాంతస్వరాన నచ్చజెప్పే ధోరణిలో.

చివాలున తల ఎత్తింది విద్య.

"ఏం మాట్లాడుతున్నారో తెలుసుకోండీ, మీవంటి వాళ్ళందరి చేతా చెప్పించుకోవలసిన నడవడి ఏమీ కాదు మాది. ఇవ్వండి నా ఉత్తరం" అన్నది లేచి నిలబడుతూ.

"ఇవ్వను. తలిదండ్రులు చూడకూడని ఉత్తరాలైతేనే ఇక్కడకు వస్తాయి. ఇటువంటివి నీకు మంచివి కాదు విద్యా, ఇంకా చిన్నపిల్లవు నీవు........"

"మేడం, క్లాసు బయట కూడా పాఠాలు బోధించడం మీ కలవాటు కాబోలు. వినే ఓపిక నాకు లేదు. ఇవ్వండి నా కవరు."

"ఇవ్వను, ప్రిన్స్‌పాల్ గారి కిస్తాను. ఆయన నుండి తీసుకో."

"చూస్తానదేమిటో." విసవిసా వెళ్ళిపోయింది విద్య.

రమాదేవి ప్రిన్స్‌పాల్ గదిలోనికి వెళ్ళేసరికి, అప్పటికే అక్కడ విద్య కూర్చుని వున్నది ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతూ. ఆమె మాటలకు చిరునగవు లొలికించుతున్నాడు.

మాటల మధ్యలో 'అంకుల్ అంకుల్' అని సంభోదించుతోంది ప్రిన్సిపాల్‌ను.

రమాదేవికి గ్రాహ్యమైంది విద్య కుటుంబానికి స్నేహితుడని ప్రిన్సిపాల్.

చేతిలో ఉత్తరం ప్రిన్సిపాల్ ఎదుట మేజాపై వుంచుతూ రమాదేవి ఏమో వివరించే లోపుగానే ఆ లెటర్‌ను విద్య తీసుకుని, పుస్తకాలలో పెట్టుకుంటూ "బై, అంకుల్" అనేసి వెళ్ళిపోయింది.

రమాదేవి మానసికస్థితి వర్ణనాతీతం.

కొద్ది క్షణాలు ఏమి మాట్లాడాలీ ఏమి చేయాలీ అనేదే తెలియనట్లైపోయి మూగగా కూర్చున్నది.

ప్రిన్సిపాల్ ఏవో కాగితాలు చూచుకోసాగాడు రమాదేవి అక్కడ లేనట్లే.

మెల్లమెల్లగా సందేహంగా రమాదేవి ఎలాగో సంగతిని వివరించ గలిగింది.

ప్రిన్సిపాల్ తేలిక చూపులతో గలగల నవ్వేశాడు.

"మిస్ రమాదేవీ! వారిది గొప్ప సంస్కారం, నాగరికతా గల కుటుంబం, మామూలు కుటుంబాలలోని పిల్లలలా అమాయకులు కాదు వాళ్ళు. కాపలాలు అవసరం లేని విజ్ఞాన మూర్తులు. "పెన్ ఫ్రెండ్‌షిప్" అనీ, అవనీ ఇవనీ యేవేవో వుంటాయి."

"కానీ ఆ అమ్మాయి ప్రవర్తన చూస్తూంటే విజ్ఞత గానీ, విద్యమీద శ్రద్ధగానీ ఏమాత్రమూ వున్నట్లు

అనిపించదు. లెక్చరర్స్‌ను తన యింటి నౌఖర్లేమో నన్నట్లుగా మాటలూ, ప్రవర్తనా......"

"ష్ !"

రమాదేవి మాటలను మధ్యలోనే తృంచివేశాడు ప్రిన్సిపాల్.

"రమాదేవిగారూ, ఇటువంటి కళాశాలలు పది నెలకొల్పగల సమర్థుడు ఆమె తండ్రి. మనం మరీ ముక్కుకు సూటిగా పోక వ్యక్తులను బట్టీ, పరిస్థితులను బట్టీ ప్రవర్తించవలసి వుంటుంది."

అంటూనే లేచి వెళ్ళిపోయాడు ఏదో పనిమీద. లోకం పోకడను అర్థంచేసుకుంటూన్న రమాదేవి ఒంటరిగా మిగిలిపోయింది అనేక ఆలోచనలతో.

ఆ సంఘటన అనంతరం ఆమె విద్య విషయం అసలు పట్టించుకోరాదని తీర్మానించుకున్నది.

కానీ, విద్యను సంస్కరించబోయి తాను కోల్పోయిన దేమిటో ఆమెకు క్రమంగా తెలిసిరాసాగింది. పూర్వం నిశ్శబ్దంగా శ్రద్ధగా పాఠాలు వినే వారల్లా విద్యార్థులు ఇప్పుడు వెకిలి నవ్వులూ, పిట్టల మాదిరిగా కువకువ శబ్దాలూ ప్రారంభించారు. విద్యార్థినులు కూడ తామేమీ తీసిపోలే దన్నట్లు ప్రవర్తిస్తున్నారు.

విద్య విరగబాటు మరింత విపరీతమైంది.

# 4

వాన విపరీతంగా కురుస్తూన్నది.

సాధారణంగా సరైన సమయానికి వచ్చే విద్యార్థులు కూడ ఆలస్యంగా వస్తున్నారీనాడు.

ఎప్పటి మాదిరిగానే మొదటి పీరియడ్ ముగియటానికి పదినిముషాలు ముందుగా వచ్చిన విద్యారూపం రోజుటికంటె అలజడి రేకెత్తించింది విద్యార్థులలో - అనటానికి నిదర్శనంగా పిల్లి అరుపులూ, కుక్క కూతలూ, మద్దెల దరువులూ ఆగకుండా విన్పించసాగాయి.

ఈ మధ్య విద్య విషయం బొత్తిగా పట్టించుకోని రమ కనులు అప్రయత్నంగా అటు తిరిగాయి.

స్త్రీత్వాన్ని గౌరవించే అందరూ సిగ్గు జెందవలసి నట్లున్న దుస్తులు, పైగా తడిసి వున్నాయి, అవయవాలన్నిటినీ మరింత స్పష్టంగా కన్పింపజేస్తూ.

'కారులో వచ్చి, కారునుండి పాదం కాలేజీవరండా మీదనే వుంచే ఈమెకు తడవవలసిన ఖర్మేమిటి?'

రమాదేవి అనుమానానికి సమాధానం వెంటనే లభించింది.

"వానలో తడవడం కూడా బలే మజాగా వుంటుంది కదూ? కారు గేటుదగ్గరే ఆపించి, సరదాగా నడిచి వచ్చాను" అంటూన్నది విద్య స్నేహితురాలితో బిగ్గరగా.

ఆ మాటలకు సమాధాన మన్నట్లుగా వెనుక బెంచీ నుండి ఒకడు "వ్హా రెవ్వా !" అని అరిచాడు.

వెన్నంటి పది గొంతులు పక పక మన్నాయి.

మరో మూలనుండి రయ్యిన వచ్చిన కాగితపు విమానం విద్య గిరజాలజుట్టులో ఇరుక్కుపోయి, విద్యార్థులకు మరింత వినోద కారణమై పక పక నవ్వులు మిన్నంటాయి.

"హూ ఈజ్ దట్ స్టుపిడ్ ?" కోపంగా లేచింది విద్య.

"మేడమ్ ! వాడెవడో అంతుచూడాలి మీరు." అన్నది బుసలు కొడ్తూన్నస్త్రీ.

"సైలెన్స్ ప్లీజ్ !" అంటూ తిరిగి పాఠం చెప్పడానికుపక్రమించింది.

"మేడమ్ !" విద్య చూపులు పొగలూ, సెగలూ క్రక్కుతున్నాయి.

"క్లాసులో ఇటువంటి విషయం జరిగితే మీ కంత నిర్లక్ష్యమా ?" పోట్లాడుతూన్నస్త్రీ వచ్చి, మేజాపై రెండు చేతులూ వుంచి రమాదేవి ముఖంలోనికి తీవ్రంగా చూచింది.

రమాదేవి నిర్లిప్తంగా క్లాసు విడచి, వెళ్ళిపోయింది గంట విన్పించడంతో.

"ఇదేమిటో ఇప్పుడే తేలుస్తాను." కదను త్రొక్కుతూ ప్రిన్సిపాల్ రూమ్ దెస నడచింది.

రెండు నిముషాలలోనే ప్రిన్సిపాల్‌నుండి కబురు వచ్చింది రమాదేవికి.

విద్యను సగౌరవంగా తన ఎదుటికుర్చీలో కూర్చుండ జేసి మాట్లాడుతూన్న ప్రిన్సిపాల్ రమాదేవిని కూర్చోమని కూడా అనలేదు.

"విద్య చెబుతూన్నది నిజమేనా?" అన్నాడు ముఖంలో అతి గాంభీర్యమూ చీకాకూ కన్పిస్తూండగా.

"ఏమిటి?" రమాదేవి తొణకకుండా అడిగింది.

"ఎవడో అల్లరివాడు ఆమె మీదికి ఏదో విసిరితే మీరేమీ కలుగ జేసుకోలేదట?" అన్నాడు చికాకుగా.

"ఆమె విషయంలో ఏమీ కలుగ జేసుకోరాదని మీరేగా చెప్పారు?" ఎదురు ప్రశ్నించింది.

"రమాదేవీ!" అసహనంగా, స్వరం హెచ్చించుతూ అన్నాడు ప్రిన్సిపాల్. "నా మాట నాకే ఒప్పజెప్పి తెలివిని ప్రదర్శించకండి. నేను చెప్పిన సందర్భం వేరు, ఇది వేరు."

రమాదేవి కూడా సహనం కోల్పోయింది

"ఇంతకూ ఏమిటి మీరనేది?" తీవ్ర స్వరాన అడిగింది.

"ఇంకా అర్థం కాలేదా? క్లాసులో అల్లరి జరుగుతోంది— జరగరాని విషయాలు జరుగుతున్నాయీ అంటే, మీరు క్లాసును అదుపులో పెట్టలేని అసమర్థత కన్పిస్తోంది."

"ప్రిన్సిపాల్ గారూ! అటువంటి వేదవాక్యాలు నేనూ కొన్ని చెప్తాను వినండి. ఒకళ్ళు ప్రవర్తించరాని

విధంగా ప్రవర్తించినప్పుడు, జరగరాని విషయాలు జరగడం సహజం. నన్ను నా బాధ్యత గురించి యింతగా నిలదీసి అడిగే ముందు మీరు విద్య వేషం సరిగా పరిశీలించ లేదని అనుకోను. ఆడది వెకిలి దుస్తులు ధరించి సిగ్గు విడచినపుడు, మగవాడు రెచ్చిపోవడం అతి సహజం."

"రమాదేవి గారూ!" ప్రిన్సిపాల్ గర్జించినట్లే అన్నాడు.

"ఔను, నా మాటలు అక్షరాలా నిజం. మీరు ఒక విద్యార్థిని ఎదుట నన్నిలా అధికారంగా అడగకపోతే నేనూ యిలా మాట్లాడి వుండను. నేను అసమర్థురాలనని మీ భావమైతే, చెప్పండి — రాజీనామా యిస్తాను రేపే. సెలవ్."

ప్రిన్సిపాల్ కంటె ఎక్కువ కోపంగా, తినేసేట్లు చూస్తూన్న విద్య దెస చూడనైనా చూడకుండా నిష్క్రమించింది.

## 5

రాస్తా అంత రద్దీగా లేదు. అక్కడొక మనిషీ అక్కడొక మనిషీ నడుస్తున్నారు వుండి వుండీ ఒక్కొక్క వాహనం కదులుతోంది. వాన విపరీతంగా రాగల సూచనలు కన్పిస్తున్నాయి ఆకాశంలో.

వీలైనంత త్వరగా ఇల్లు చేరుకోవాలని త్వరితంగా అడుగులు వేస్తూన్న రమాదేవి ప్రక్కనే ఢీకొన్నట్లుగా

ఆగిన కారును గమనించి అదిరిపడుతూ నాలుగడుగులు ప్రక్కకు నడిచింది.

"హల్లో రమా!" అనే పరిచిత కంఠం విని కాస్త ప్రాణం కుదుట పడగా కారులోనికి చూచింది.

కళాశాలలో కెమిస్ట్రీ లాబ్‌లో డిమాన్‌స్ట్రేటర్ సుభద్ర, ఆ పలుకరించిన ఆమె.

రమాదేవికి సుభద్రతో ఎక్కువ స్నేహం లేకపోయినా పరిచయం బాగానే వున్నది.

రమాదేవి ప్రక్కన, మరో యువతి ఎవరో వున్నది సాధారణ వేషంలో.

డ్రైవింగ్ సీట్‌లో వున్న ప్రౌఢ చాలా ఖరీదైన వేషంలో వున్నది.

వజ్రాల గాజులు ధరించిన చేతితో బాబ్డ్ హెయిర్‌ను సవరించుకుంటూ, గాగుల్స్ తీసి తుడిచి పెట్టుకుంటూ రమాదేవిని చూచీ చూడనట్టుగా గమనించుతోన్నది.

ఆమె ముఖానికి అలదిన రంగుల బాపతో-లేక చీరకు పులిమిన విదేశీ ద్రవ్యాలో తెలియదు కానీ, ఆమడ దూరం వఱకూ సువాసనలు వ్యాపించుతున్నాయి. ఈ నిగనిగ లాడే కారూ, అంతటి ఖరీదైన మనుషులూ తన కొఱకు ప్రత్యేకంగా ఎందుకు ఆగారో తెలియక చూడసాగింది రమ.

"వాన వచ్చేట్టుంది రమా, రారాదూ, కార్లో దింపేస్తాం ?" అన్నది సుభద్ర తల ఈవలికి పెట్టి.

రమకు ఈ ఆహ్వానం తికమక కలిగించగా కారులోని మనుషులను మార్చి మార్చి చూడసాగింది.

"కారు మన వారిదేలే, రా." సుభద్ర దీర్ఘం తీసింది.

"గెటిన్" అన్నది ఖరీదైన స్త్రీ, రమ దెస అరక్షణం చూచి.

ఆ మాటలో చాలా దర్పమో, అతిశయమో ప్రతిధ్వనించినట్లనిపించింది రమాదేవికి.

సుభద్ర వెనక డోరు తీసి "రా త్వరగా. వాన వచ్చేట్టుంది." అంటోంది.

'ఈ ఆహ్వానాన్ని మన్నించడమా, వద్దా!' అనే మనసులో తర్కం ఎటూ తేలలేదు.

'ఎవరి తీరూ స్వభావాలు వారివి. నాకేల? పోనీలే అంత బతిమాలి పిలుస్తున్నారు కదా!'

అనుకుంటూ పోయి సుభద్ర ప్రక్కన కూర్చుంటూ "థాంక్స్" అన్నది.

అందుకు ఎవరినుంచీ సమాధాన శబ్దం వినరాలేదు.

బయట వాన జల్లు ప్రారంభమైంది.

కారు మెత్తగా దూసుకు పోతోంది.

రమ ముంగురులు సవరించుకుంటూ కారు అద్దంవేపు చూచింది అనుకోకుండా.

కారు నడుపుతూనే తననే పరీక్షగా చూస్తూన్న ఆ ధనవంతురాలి ముఖం ఆ అద్దంలో కన్పించగా ఖంగారుపడి

చూపులు త్రిప్పుకుంటూ ప్రక్కనున్న సుభద్రవేపు చూచింది.

సుభద్ర ఓ విషపు నవ్వు నవ్వింది.

"ఈ ఊరికెల్లా ధనవంతులు వీరు. నీకు తెలియదా?" అన్నది రహస్యంగా చెవిలో.

'తెలియ'దన్నట్టు తల అడ్డంగా త్రిప్పి పూరుకున్నది రమాదేవి.

బయట వాన ఉధృతం అధికమైంది.

"మనకు ఏ పని కావాలన్నా, ఏ సహాయం కావాలన్నా వారితో ఒక్కమాట చెప్పుకుంటే చాలు. మర్నాటి సాయంత్రానికి జరిగిపోతుంది. అంత పలుకుబడి!" అన్నది తిరిగీ కళ్ళు త్రిప్పుతూ.

తన ముందు ఈ స్తోత్రపాఠం ఎందుకో అర్థంకాలేదు రమాదేవికి.

'పూర్వకాలంలో రాజులకు భట్రాజుల లాగా ఈ కాలపు ధనవంతులకు యిటువంటి భజనసమాజం పోషణలో వుంటుందేమో!' అనుకున్నది తిరిగీ.

ఆమె ఆలోచన నిజమని నిరూపించాయి, ఆ తర్వాత సుభద్ర మాట్లాడిన మాటలు.

"మా తమ్ముడు వీరి యింట్లో ట్యూషన్ చెప్తున్నాడు. అంత మాత్రానికే మా కుటుంబ మందరినీ ఎంతో ప్రేమగా చూచుకుంటారు. అంతవరకూ ఎందుకూ—నాలుగేళ్ళలోగా నాకు రెండుసార్లు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స వచ్చాయి. రెండు

వాళ్లూ వీరే ఆ ఆర్డర్స్‌ని కాన్సిల్ చేయించి పుణ్యం కట్టుకున్నారు. లేకుంటే మధ్యతరగతివాళ్ళం—మాటి మాటికీ మూటాముల్లే కట్టుకుని ఎక్కడికి పోగలం? ఇటువంటి వారి అండా, అభయం లేనిదే ఈ ఉద్యోగాలు చేయనూ లేము, బ్రతకనూ లేము.”

ఆ మాటలలో ఏదో అంతరార్థం ధ్వనించగా, రమాదేవి ప్రక్కకు తిరిగి సుభద్రను తేరిపార చూచింది.

సుభద్ర ఎంత వాగినా చెక్కుచెదరకుండా మాటా మంతీ లేకుండా కూర్చున్న రమాదేవి, మిగిలిన శ్రోతలకు విసుగు కలిగించినదనడానికి నిదర్శనంగా డ్రైవింగ్ సీటు నుంచి ఓ నాజూకైన సకిలింపు వినబడింది.

అది బహుశః సంకేతం కావచ్చు.

ఆ సకిలింత వింటూనే, సుభద్రకు అటువైపున అంత వరకూ మూగిగా కూర్చున్న అవతారానికి మాటలు వచ్చాయి.

“అన్ని మాటలెందుకు సుభద్రగారూ? ఈ ఊళ్ళో పెద్ద పెద్ద సమావేశాలు ఏవీ సుజాతగారి అధ్యక్షత లేకుండా జరగవనీ, చాలా తగవులు కోర్టులవరకూ పోకుండా వారే తీర్పిస్తారనీ చెప్తే చాలదూ?”

“ఔను.” మళ్ళీ సుభద్ర అందుకుంది. “అలాగే, వారిని ఎదిరించి ఇక్కడ నిలద్రొక్కుకు బ్రతకగల వాళ్లూ లేరు యింతవరకూ. ఒకసారి ఒక ఆఫీసర్ కొంచం తలబిరు

సుగా ప్రవర్తించాడని, అండమాన్స్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించారు వారం తిరిగేసరికి.''

విని వినీ చెవులు చిల్లులు పడుతున్నట్లనిపించింది రమాదేవికి. 'పనిమాలా పిలిచి ఆ కారులో కూర్చుండజేసి, ఈ ఘనకార్యాలన్నీ తనకు విన్పించాల్సిన అగత్యమేమిటి? తాను కూడా వీరికి దాసోహమని బ్రతకాలా యిక? ఇది తెలియ జెప్పడానికేనా ఈ డొంక తిరుగుడంతా?'

రమాదేవి ముఖంలోని ప్రశ్నార్థకం గమనించిన శ్రోతద్వయం ఒక్కసారిగా యుగళగీతంలా విన్పించారు అసలు విశేషాన్ని.

"ఓ! ఇంతకూ వీరెవరో మీకు తెలియదు గదూ? కోటీశ్వరులైన కోటేశ్వరరావుగారి కోడలు; మ్యునిసిపల్ కమిషనర్ గారి భార్యగారు. అన్నట్టు......మీ స్టూడెంట్ విద్యారాణి—బియ్యేలో చదువుతోంది— వీరి అమ్మాయే! ఒక్కతే అమ్మాయి! ........ వారికి చదువు అవసర మేముందీ మనలాగా? సరదాకు చదువుతోంది."

ఇంకేమీ విన్పించటం మానేసింది రమాదేవికి. చెవులలో రైళ్ళు పరుగెడుతూన్నట్లే హోరుగా వున్నది. తమ గారాల పుత్రికను క్రమశిక్షణ పాటించమని చెప్పడం గూడా ఒక నేరంగా భావించి, అన్యాపదేశంగా తనకే హెచ్చరికలు విసిరారన్నమాట!

సుభద్రకూడా తనవంటి ఉద్యోగినే. అయితేనేం— వాళ్ళకు దాసీలాగా బ్రతుకుతోన్నట్టు తెలుస్తూనే వున్నది

ఆ మాటల వలన. సామాన్యులలో ఈ బానిసత్వపు స్వభావం వున్నంతకాలం అటువంటి కోటీశ్వరులలో మదం వృద్ధి పొందుతూనే వుంటుంది.

ఆలోచనలలో పడిన రమాదేవి సుభద్ర హెచ్చరింపుతో తెలుసుకొన్నది గమ్యం జేరినట్లు.

"మీ ఇల్లు వచ్చేసిందండీ. ఏమిటా ఆలోచన ?"

ఇంటి ముందు వఱకూ పోనీయలేదు కారును. వీధి మలుపులోనే ఆపారు.

'తమ ఇల్లు కూడా తెలుసన్నమాట వారికి !' ఆశ్చర్యం కప్పిపుచ్చుకుంటూ, వాహనం దిగి హోరున కురుస్తూన్న ఆ వానలో నిలబడి ఆ కారు యజమానురాలితో ఏమో చెప్పటానికన్నట్లు డోరుపై చెయ్యివేసి తల ముందుకు చాచింది రమాదేవి.

ఇంకా ఆమె నోరు విప్పకముందే కారు దూసుకు పోయింది రంయ్యన.

'ఎంత అవమానం !' రోషపడింది రమాదేవి మనసు.

"ఏమిటి రమా అలా వానలో నిలబడ్డావ్ ?"

ఆఫీసునుంచి వస్తూన్న ఆమె అన్న శేఖరం ఆశ్చర్యంగా అడిగాడు ఆమెనూ, ఆమె చూస్తూన్న కారునూ మార్చి మార్చి చూస్తూ.

"పద, లోపల చెప్పుకొందాం."

ఇంట్లో అడుగిడుతూనే ఆ తడిసిన దుస్తులను కూడా

మార్చుకోకుండా అన్నకు విషయమంతా ఆమూలాగ్రంగా వివరించింది.

"అదంతే రమా! ధనవంతులు ఆడింది ఆట. బాధ పడకు." అన్నాడు నిట్టూర్చుతూ.

వదిన కలుగజేసుకున్నది. "ఆ పిల్ల క్రమశిక్షణ నేర్చుకోకుంటే ఆమే బాధపడుతుంది తర్వాత. మనకేం? ఆమె నడవడి గురించిన చింత ఆమె తలిదండ్రులకే లేకుంటే మనకేం? ఎవళ్ళనో సరిదిద్దబోయి మధ్యన మనం అవమానాల పాలుకావడం దేనికీ? ఆ తల తుడుచుకో, బట్టలు మార్చుకో."

"ఔను రమా, వాళ్ళు మనుష్యులను చంపించి విషయం అజ రాకుండా మాఫీ చేయించగల ఘనులని విన్నాను నేను. ఈ రోజుల్లో ఎవరి బాగు వారి చూచుకోవల్సిందే. ఇతరుల విషయంలో అంటీ అంటనట్లుగా వుండేవాళ్ళు తెలివైనవారు. 'నీ యిల్లూ, నీ వివరాలూ అన్నీ మాకు తెలుసు సుమా' అని చెప్పడానికే నిన్నింతవఱకూ తీసుకొచ్చి దిగవిడిచారు. మరో రోజు మరెక్కడికైనా తీసుకుపోగలరు. నీ ఉద్యోగం, నా ఉద్యోగం కూడా పీకి పారేయించగలరు. ఆ పిల్ల ఎలాగ వున్నా నువ్వు పట్టించుకోకు క్లాసులో." అని సలహా యిచ్చాడు శేఖర్.

ఆ సలహా నచ్చినా నచ్చక పోయినా, అంతకంటె తాను చేయగలదేమీ లేదని గ్రహించింది రమ.

అయితే ఆమె సహనానికి పరీక్ష అన్నట్లుగా రోజూ విద్య ఏదో ఓ చీకాకును కలిగించుతూనే వున్నది.

రాము మాట్లాడక మౌనంగా వుండిపోవడం చూచి గేలిగా విజయగర్వంతో నవ్వుతుంది. మిగిలిన విద్యార్థినీ విద్యార్థులు కూడ హేళనగా చూస్తూ అల్లరి ప్రారంభించు తున్నారు పాఠం వినకుండా.

ఒకనాడు క్లాసులో పాఠం జరుగుతూండగా వెనక బెంచీలో టపాకాయలు ప్రేల్చాడు ఒక విద్యార్థి.

క్లాసందరికీ అది వినోద కారణమైనది.

"రేపు మతాబాలు తెచ్చుకుందాంరా." అంటూ పకపకలించుతున్నాడు ఆ ఘనకార్యం చేసినవాడు.

"కాదు. తారాజువ్వలు." మరొకడి ప్రతిపాదన.

మరి అటువంటి పరిస్థితిలో మౌనంగా వుండగల ఓర్పు రాముకే కాదు — ఎవరికీ వుండదు.

"మిస్టర్ రామూ! వ్హాటీజ్ దట్ నాన్సెన్స్? గెటౌట్ ఆఫ్ మై క్లాస్." అన్నది కోపంగా.

"ఎందుకండీ?" అన్నా డతడు మరింత పకపకలించుతూ.

"నువ్వు చేసిన బుద్ధిమాలిన పనికి. నువ్వేం చిన్న వాడివా? థర్డ్ క్లాసులో కొచ్చావ్. అంతమాత్రం జ్ఞానం లేదూ?"

"నేనింకా చిన్నవాడినే నంటారండీ మా అమ్మా నాన్నగారూ." అన్నాడు రాము అమాయకంగా చూస్తూ.

అంతా విరగబడి నవ్వారు.

"కుర్రాళ్ళం — మేం అల్లరి చేయకపోతే మీరు చేస్తారుటండీ మేడం ?" అన్నాడు మరొకడు కీచు గొంతుతో.

ఈసారి బల్లలు ధనధనా బాదుతూ, నవ్వుతూ తమ సంతోషం ప్రకటించారు విద్యార్థులు.

ఈ రభస కంతకూ కారణమైన రాముపై ఆగ్రహం అధికమైంది రమాదేవికి.

"ముందు నువ్వు క్లాసునుంచి బయటికి నడుం మిస్టర్ రామూ." అన్నది తీవ్ర స్వరాన.

"బయటికి పోతే మీ పాఠాలన్నీ ఎలా వినగలనండీ ? నేను పోను." పెంకెతనంగా కూర్చున్నాడు, అంతవఱకూ నిలబడి వున్నవాడల్లా.

ఆ ప్రక్కవాడు చాకులా లేచి నిలబడ్డాడు.

"విద్య అయితే ఎంత అల్లరి అయినా చేయొచ్చు కానీ మేం చచ్చినట్టు పడుండాలా ? మీకు జాతి పక్షపాతం ఎక్కువ మేడమ్ !" అని నిందారోపణ జరుపుతూ అందరి దెసా సగర్వంగా చూచాడు, కాలరు సర్దుకుంటూ.

అంతా నవ్వును ఆపుకొంటున్నారు బలవంతంగా. ముందు సీట్లోనున్న విద్య ఛట్టున లేచింది.

"ఎవడా స్కౌండ్రల్ నా పేరెత్తినది? జాగ్రత్త!"

"చూశారా మేడమ్ !" రాము ఏడుపు ముఖంతో లేచి నిలబడ్డాడు. "మీ వల్లనే కదా ? మీ రిచ్చిన అలుసు వల్లనే కదా — ఆడపిల్లలు మమ్మల్ని యింతింత తిట్లు

తీసుకున్నారు? మీరు ముందు విద్యపై యాక్షన్ తీసుకోవాలి."

"వాడు ముందు నా పేరెత్తినందుకు వాడిమీద యాక్షన్ తీసుకోవాలి మేడమ్." కఠినంగా ఆజ్ఞాపించినట్టే అన్నది విద్య.

ఇక రమ మాట విన్పించుకొనేవారు లేరు.

"రామూ డౌన్ డౌన్, ఇక మగవాళ్ళ అల్లరి ఆగదాలూ చెల్లవ్." అని విద్యార్థినులూ,

"లేడీ స్టూడెంట్స్ డౌన్ డౌన్, ఈ ఆడ అధికారాలూ బిరగబాటులూ గతించాయి." అని విద్యార్థులూ,

బద్ధ శత్రువులలాగా రెండుపక్షాలై అరపులూ, కేకలూ ప్రారంభించారు.

మెల్లగా కళాశాలలోని తదితర తరగతులలోని వారంతా అక్కడ గుమిగూడసాగారు.

యథాలాపంగా పోతూన్నట్లు ఆ ప్రక్క వరండా మీదుగా పోతూ ఇద్దరు ముగ్గురు లెక్చరర్లుకూడా కుతూహలంగా చూడటం గమనించింది రమ.

తరగతి విడచి పెట్టి నిశ్శబ్దంగా ప్రిన్సిపాల్ రూమ్ వైపు నడచింది రమ.

ఏవో కాగితాలు చూచుకుంటూ వంచిన తల ఎత్తకుండానే, రమాదేవి చెప్పిన విషయమంతా "ఊఁ." "అహాఁ." లతో విన్నాడు ప్రిన్సిపాల్.

రెండు నిముషాల తర్వాత, తలమునక లౌతూన్న

పనిలో నుండి తప్పనిసరిగా తలెత్తినట్లుగా ఎత్తి చీకాకుగా చూచాడు రమాదేవిని.

"ఇదే ఈ క్రొత్త క్రొత్త అనుభవంలేని మాష్టర్లతో వచ్చే చిక్కు. చేతిలో డిగ్రీ వుందని ఉద్యోగానికి బయల్దేర తారు; మేష్టరు గిరీ ఏదో చాలా సులభమూ సుఖమూ అని దాని కెగబడతారు; తీరా ఉద్యోగం యిస్తే యిదీ వరస— కుర్చీలో కూర్చోవడమూ రాదు, స్టూడెంట్సుని కంట్రోల్ చేయడమూ రాదు. పైగా మా గొంతు మీదికి తెస్తారు కుఱ్ఱాళ్ళని రెచ్చగొట్టి."

దడ దడా వాగేశాడు.

అదే సమయానికి అక్కడకొచ్చిన ఇంగ్లీషు లెక్చరర్ రమాదేవి దెస హేళనగా చూచి ముఖం మరో దెసకు త్రిప్పుకొన్నాడు.

రమాదేవి అవమానం జరిగినట్లే కాక, పుండుపై కారం జల్లినట్లు బాధపడింది. వెంటనే రాజీనామా వ్రాసి యిచ్చి ఇల్లు జేరింది.

* * *

ఈనాడు ఆ గత సంఘటనలన్నీ రమాదేవికి గుర్తు వచ్చిన కారణం — ఆమె ఎదురుగా దీనావస్థలో నిలబడి వున్న ముప్పై ఏళ్ళ లోపు యువతి.

"మీా సంస్థలో ఏదో ఓ చిన్న పని యిప్పించండి అమ్మా. ప్రాణం నిలిపిన వారౌతారు." అని దీనంగా అర్థించు తోంది.

ఏవో అర్జంటు కాగితాలపై సంతకాలు చేస్తూన్న రమాదేవి ఆ విన్నపాన్ని సరిగా వినలేదు.

"రెండు రోజులుగా వచ్చి పోతున్నాను. మీ దర్శనం లభించలేదు ఈ రోజైనా ఏదో ఓదారి దొరకగలదని ఆశతో వచ్చానమ్మగారూ."

సంతకాల పని పూర్తయే సరికి, గుమాస్తా వచ్చి ఆ రోజు టపాలోని ముఖ్యమైన ఉత్తరాల విషయం చర్చించి వెళ్ళాడు, ఓ అరగంట సేపు.

అంతలో ఓ టెలిఫోన్ కాల్.

మాటలు ముగించుతూండగానే మరో టెలిఫోన్ రింగ్.

తనను అలా నిలబెట్టి, బుద్ధిపూర్వకంగానే ఈ కాల యాపన చేస్తూన్నదని భావించింది ఆ బీద యువతి.

"మా వంటి యాచకుల నెందరినో చూచి వుంటా రమ్మా మీరు. నేను నిజంగానే దారీ తెన్నూ లేక అల్లల్లాడు తున్నాను. ఐశ్వర్యంలో పుట్టానన్న గర్వంతో కన్నూ మిన్నూ గానక తిరిగాను. ఈనాడు నా ఐశ్వర్యమూ లేదు, నా వాళ్ళూ లేరు. అన్నీ నేనేనని వెంట తెచ్చినవాడు అధోగతి చేసి వదలి పారిపోయాడు........"

ఆమె వింటూన్నదో లేదో నని చూడకుండా కుర్చీకి వెనకగా అల్లంత దూరంలో నిలబడి తన గోడును వెళ్ళబోసు కుంటూన్న ఆ యువతి మాటలు ఒక్కసారిగా ఆగి పోయాయి, రమాదేవి రివాల్వింగ్ చెయిర్ ఇటు తిరగగానే,

"ఎటువంటి పని చేయగలవు? చదువు రాదంటు

న్నావ్......" ఇంకా యేమేమో మాట్లాడ బోయిన రమా దేవి మాటలు ఆగిపోయి, ఆ యువతిని పరీక్షగా చూడ సాగింది.

"ఎవరు నువ్వు? నిన్నిది వఱలో ఎక్కడో చూచానను కుంటానే?"

ఒక్కసారిగా అదిరిపడింది ఆ యువతి. మరుక్షణం లోనే గిరుక్కున తిరిగి, పరుగెత్తినట్లే నడచి కనుమరుగైంది.

ఆ నడక రమాదేవికి పరిచితంగా అన్పించింది.

ఆమె......ఆమె విద్య కదూ?!

అపరిమితమైన ఆశ్చర్యం కలిగింది.

ఆనాటి అందం, పొగరూ, అన్నిటినీ మించి ఆ ధనమూ ధన మదమూ ఏమైనాయి?

ఆమేయే కాదు—ఆమెను ఎరిగున్న ఎవ్వరైనా ఊహించి వుంటారా, భవిష్యత్తులో ఆమెకీ స్థితి రాగలదని!

బండ్లు ఓడలూ, ఓడలు బండ్లూ అంటే ఇదేనా?

ఆశ్చర్యంనుండి తేరుకున్న రమాదేవి, "సుబ్బలూ!" అని ఆత్రంగా పిలిచింది.

"ఏమిటమ్మ గారూ?"

తేనీటి ట్రే ప్రక్కబల్లపై వుంచుతూ, ఆత్రంగా పరు గెత్తు కొచ్చింది.

"చూడూ, ఆ గబగబా వెళ్ళిపోతూన్న అమ్మాయి వుందే—చూశావా?"

"ఆఁ ఆఁ, ఆవిడేనా ?" కిటికీలోనుంచి చూస్తూ అడిగింది సుబ్బులు.

అప్పటికే విద్య వీధి గేటు దాటుతోంది.

"తప్పకుండా ఉద్యోగ మిస్తాను. రమ్మనమని తీసుకురా. ఏమీ భయం అక్కర్లేదని చెప్పు. పాపం, చాలా కష్టాల్లో వున్నట్లున్నది."

మాట వింటూనే సుబ్బులు పరుగెత్తింది.

కానీ పావుగంట అనంతరం సుబ్బులు ఒక్కతే నీరసంగా తిరిగి వచ్చింది.

"ఎంత చెప్పినా వినలేదమ్మగారూ, కన్పించిన బస్సు ఎక్కి వెళ్ళిపోయింది."

"హుఁ." జాలిగా నిట్టూర్చింది రమాదేవి. తనను ఉద్యోగం చేయనీయకుండా తరిమివేసిన ఆ గత సన్నివేశాలన్నీ కనుల ముందు మెదిలాయి.

పరధ్యానంగా వున్న అమ్మగారిని పరకాయించి చూచింది సుబ్బులు.

"అమ్మగారూ ! ఎవరామె ? ఎందుకలా పారిపోయింది ?" అనడిగింది, టీ కప్పు అందించుతూ.

బరువైన నిశ్వాసంతో అన్నది రమాదేవి: "ఎవరని చెప్పను సుబ్బులూ ? నీ కంటె దురదృష్టవంతురాలు. అధికారాలూ, ఐశ్వర్యాలూ అశాశ్వతమని తెలియక విఱ్ఱవీగి

ఈ దశ కొచ్చింది. నేను ఈ శరణాలయపు మానేజర్‌గా రావడానికి చాలా సంవత్సరాల క్రితం నా విద్యార్థిని !"

సుబ్బులు వదనం మలినమైనది.

గతస్మృతులతో ఆమె మనసు భారమైనది.

* * *

ఆనాడు కళాశాలలో విద్య కారణంగా రాజీనామా చేసిన రమాదేవి, మరి ఒకటి రెండుచోట్ల నౌఖరీలు చేసి మరో తరహా లౌక్యాలనూ నీచత్వాలనూ చూచి విసిగిపోయి మానుకున్నది.

తానూ, వదినా, మరిద్దరు స్నేహితులూ కలసి, ఓ గ్రామంలో ఆడపిల్లలకు చదువులూ, కుట్లూ అల్లికలూ నేర్పే ఓ చిన్న స్కూలు నడపడం ప్రారంభించారు.

అది అప్పటికి ఇంకా ఎదగని గ్రామం. అప్పుడప్పుడే ఓ మాదిరి పట్టణపు నాగరికతను అలవరచుకుంటూ, ఒక్కో సౌకర్యమే ఏర్పరచుకుంటూ ఎదిగే ప్రయత్నంలో వున్నది.

ధనమదంతో, వెకిలి వేషభాషలతో విఱ్ఱవీగే వారికి విద్య నేర్పబోయి విరసాన్ని రుచి చూడటం కంటె, ఈ ఎదిగి ఎదగని అమాయక పల్లెవాసుల బుద్ధిని వికసింపజేసి విజ్ఞానవంతులను చేయడం సులభ సాధ్యమేగాక మంచి పని కూడా నని తలపోసింది రమాదేవి.

పాఠశాల ప్రారంభించడంలో రమాదేవికి ఎటువంటి ఆటంకాలూ ఎదురవ్వకపోగా గ్రామపెద్దల - ముఖ్యుల సద్భావ సహకారాలు కూడా లభించాయి.

కాన్సీ పాఠశాల నడకలో పురోభివృద్ధిలో కుంటుపడ సాగింది.

కారణం - ఎవరినైతే అమాయక పల్లెవాసులని భావించిందో, వారిలో అమాయకత్వం కంటే అనేక విషయాలలో జీర్ణించుకుపోయిన అభావాలూ, పట్టుదలలూ కరగించి దృక్పధాలు మార్చగలగడం కష్టసాధ్యమూ కష్టతరమూ అంటే సరిపోదు - అక్షరాలా భగీరథ యత్నమే !

"రోజూ టైముకు రావాలమ్మా స్కూలుకు" అని ఎన్నిసార్లు చెప్పినా ఒకటే ప్రయోజనం.

"మా అమ్మ యిప్పుడే పంపిందండి." అనేది ఓ అమ్మాయి.

"కూరయాల యింటో కొంచం పనుండి పోయిందండి మరి !" మరో అమ్మాయి.

"నిన్న రాలేదేం ? ఎక్కువ సెలవులు తీసుకో కూడదు" అంటే,

"చుట్టాలొచ్చారండి, మరో నాల్రోజుల దాకా రావని చెప్పడాని కొచ్చాను." అని తుర్రుమన్నది ఒక పిల్ల.

"అట్లతద్ది గదండీ. గోరింటాకు పెట్టుకున్నాను. అందుకే రాలేదు నిన్న."

"నిన్న రాత్రి తోలుబొమ్మలాట చూసొచ్చేసరికి పొద్దోయింది. తెల్లారి బేగ మెలకువ రాలేదు మరి."

"బట్టలు కొనుక్కోడానికి టౌనుకెళ్ళి, సినేమాకూడా సూసొచ్చేం. మరేమో ఈ మాపిటికి హరికథ వింటాని

కెళ్లాల. మున్సబుగారమ్మాయి పెళ్ళికదూ ? నాల్రోజులు రాను. పెళ్ళికూతుర్ని అత్తోరు తీసికెళ్ళాక వస్తాను."

ఇలా చిత్ర విచిత్రమైన సాకులు వినవచ్చేవి.

అటువంటి వారిలో సుబ్బులు ఒకతె. గ్రామ కరణం గారి అమ్మాయి.

"బొత్తిగా ఇలా పాఠాలు చదవకుండా వస్తే ఎలా చెప్పమ్మా సుబ్బులూ ? ఇక ఈ పుస్తకాలవీ ఎందుకూ ? దండగ." అని రెండు మూడుసార్లు మందలించింది రమ.

ఏమీ మాట్లాడకుండా, వినయంగా మాత్రం కూర్చునేది సుబ్బులు, చదవకపోయినా.

"మా వదిన శ్రావణ మంగళవారం నోము నోచుకున్నదండి. మిమ్మల్ని తప్పకుండా పేరంటానికి రమ్మన మన్నదండి మా అమ్మ. పిలుపులూ అవీ వుంటాయికదండీ— ఇవ్వాళా రేపూ రాను." అని చెప్పి వెళ్ళిపోయిం దొకనాడు సుబ్బులు.

పట్టణంలాగా కాదు గ్రామంలో. అందరితో కలసి మెలసి వుండాలి.

'సరే, పేరంటానికి వెళ్ళినట్టూ వుంటుంది. సుబ్బులు విషయం వాళ్ళ అమ్మగారితో మాట్లాడవచ్చు' అనుకున్నది రమాదేవి.

కరణంగారి భార్య ఆప్యాయంగా ఆహ్వానించి కూర్చుండ జేసింది రమాదేవిని. ప్రక్కనే కూర్చుని ఎంతో కలివిడిగా

మాట్లాడింది. అంత చదువుకునీ యింత నిరాడంబరంగా వున్నందుకు హర్షం ప్రకటించింది.

తన వయస్సు గురించీ, ఇంకా వివాహం కాకపోవడం గురించీ అమ్మలక్కల స్పష్టంగా వినవచ్చే గుసగుసలను ఓ చెవితో వింటూ, మరో ప్రక్క కరణంగారి భార్య అందించుతూన్న ఆప్యాయతను అందుకుంటోంది రమాదేవి.

ముత్తయిదువలకు బొట్టూ, గంధం యిస్తూ, పసుపు రాస్తూ, పరాచికాలాడుతూ చకచకా తిరుగుతోంది సుబ్బలు, పట్టు పరికిణీ ఓణీ గరగరలతో.

‘ఇంత చలాకీతనమూ చదువు వఱకూ వచ్చేప్పటికి ఏమైపోతుంది ఈ పిల్లకి ?’

లోపలో తాను తలపోస్తూ, ఆ విషయం సుబ్బలు తల్లితో ఎలా మాట్లాడాలో ఆలోచించుకుంటూన్న రమాదేవికి ఆ కష్టం అవసరం లేకుండా ఆవిడే ఆ ప్రస్తావన తీసుకు వచ్చింది.

“ఏమిటో మాష్టరమ్మగారూ. మీవంటి చదువుకున్న వారిని చూస్తే సంబరమే అనుకోండి మాకు — మగాళ్ళకు మల్లే మీరు కూడా యింతింత లేసి పుస్తకాలు చదవడమూ, ఉద్యోగాలు చేయడమూ చక్కగా వుంది. అయితే అంత అదృష్టం అందరికీ వుంటుందా అమ్మా? ఆ సరస్వతి అందరికీ అందుతుందా?”

“ప్రయత్నించితే అందనిదేమున్నది పిన్నిగారూ? చదు

వుకు తెలిపీ, శ్రద్ధావుండాలేకానీ ఆడేమిటి, మగ ఏమిటి?" అన్నది రమాదేవి.

"అన్నీ వున్న ఆకు అణిగే వుంటుందని– మీరు అలాగ అనకేమంటారు లెండీ! మా యింట్లో ఆడపిల్లలెవ్వరికీ పెద్ద చదువులు లేవమ్మా. ఈ ఏడు సుబ్బులికీ పెళ్ళిచేసేస్తాం. వంటావార్పూ ముఖ్యం కానీ ఈ పుస్తకాలేసుకుని అత్తింట ఏంచేస్తుంది చెప్పండీ? అంతవఱకూ ఏదో కాలక్షేపం,అంతే. కాస్త చూచీ చూడనట్లు వదిలేయండమ్మా. చదవమని సతాయించకండి, అసలే అర్భకపు పిల్ల!"

రమాదేవి నోరు మూతపడిపోయింది.

'అలంకారార్థమూ పాఠశాలకు రావడం? కానీ ఆవిడ సనాతన భావాన్ని తాను ఏ విధంగా మార్చగలదు? వీరందరి సహకారమూ లేనిదే తన పాఠశాల ఎలా నడుస్తుంది?'

కోడలు సెనగలూ, తాంబూలం వగైరా వున్న వాయనం తెచ్చి రమాదేవికి ఈయబోతూంటే కరణంగారి భార్య వారించింది.

"పెద్ద చదువులు చదివిన ఉద్యోగస్థురాలు ఆమెగారు. స్వయంగా మోసుకెళ్తారా?" అంటూ పాలేరును పిలిచింది, రమాదేవి వారించినా సరకు జేయకుండా.

పెద్ద ప్లాస్టిక్ బుట్టనిండా అరటి పళ్ళూ,కొబ్బరికాయా, సెనగలూ, తమలపాకులూ నింపి, రమాదేవి వెంట ఇంటి వఱకూ తీసుకుపొమ్మని ఫర్మాయించింది.

ఆ ఆప్యాయతలో కృత్రిమం ఏమీ లేదు. సహజమైన

ఆదరణే అది. అటు అమాయకత్వమూ వున్నది. ఇటు నిండు తనమూ వున్నది.

అందుకే రమాదేవి మారు మాట్లాడలేకపోయింది. దారిలో మోతుబరి రైతు రామయ్య పలుకరించాడు.

"నమస్కారం పంతులమ్మగారూ, మా అమ్మాయి చదువెలా గుంది?"

"నిన్న మార్కులు యింటికి పంపించానండి."

"ఔనులెండి, చూచాను. ఏంటో—అంత బాగాలేవు మార్కులు. పిల్ల చాలా తెలివైనదే మరి. కాస్త గట్టిగా చెప్పండి నాలుగు ముక్కలు."

నవ్వింది చిన్నగా, "నేను బాగానే చెప్తున్నానండి. కొంచం — ఇంటి దగ్గఱకూడా ఓ గంటైనా శ్రద్ధగా చదవమని చెప్పండి."

"ఊఁ" మూలిగినట్లు అని ముందుకు సాగిపోయాడు.

లోలోన నవ్వుకొన్నది రమాదేవి. తాను సరిగా చదివించడం లేదేమోనని ఆయన అనుమానం. పరిశ్రమ అవసరమనే గ్రహింపు లేదు.

అలా రెండేళ్ళు కుంటి నడక నడచిన స్కూలు, గ్రామంలో తల ఎత్తిన రాజకీయాల వల్ల రద్దుచేయబడింది.

ఆ లోపుగా సుబ్బులు వివాహం కావడమూ, విధవరాలై తిరిగి రావడమూ కూడా జరిగిపోయింది.

ఇటు కరణంగారూ గతించడం వల్ల వారి యింటి పరిస్థితులు మారిపోయాయి. ఆస్థి అప్పులవారు తీసుకున్నారు.

అటు ఆమెకు భర్త ఆస్థి ఏమీ దక్కకుండా అత్తవారు జాగ్రత్త పడ్డారు.

"చదువుకొంటే ఏమైనా ఉద్యోగం చేసుకుందును. బుద్ధి తక్కువదాన్ని." అని ఏడ్చేది సుబ్బులు అప్పుడప్పుడు రమాదేవి వద్దకు వచ్చి.

పాఠశాల ఉపసంహారణ తర్వాత రమాదేవి తిరిగి పట్టణంలో ఓ శరణాలయంలో ఉద్యోగానికివస్తూ సుబ్బులును కూడా తనతో తీసుకు వచ్చేసింది ఆమె అభ్యర్థనపై. రమాదేవి అవసరాలను కనుక్కుంటూ, ఆమెకు ఒక అంతరంగికురాలిలా ఆ యింట స్థిరపడిపోయిన సుబ్బులు అవకాశందొరికినప్పుడెల్లా ఆ శరణాలయంలోని అందరికీ హితబోధ చేస్తూంటూంది 'బుద్ధిగా చదువుకో'మనీ, 'అంతకుమించిన సన్మార్గం లే'దనీ.

* * *

గతస్మృతులతో చెమర్చిన కనులను ఒత్తుకుంటూ అన్నది సుబ్బులు, "మిడి మిడి జ్ఞానాలతో మిడిసి పడుతూ డబ్బే లోకం అనుకుంటారు చాలమంది మూర్ఖంగా. కానీ 'విద్యను మించిన విత్తం' లేదనడానికి మీ జీవితమూ, నా బ్రతుకూ, విద్య బ్రతుకే నిదర్శనాలు అమ్మగారూ!"